
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 జూలై 2025



ధాన్యం బకాయిలు విడుదల

జిల్లా రైతులకు రూ.6.29 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ధాన్యం విక్ర యించిన రైతుల బకాయిలు రూ.24.55 కోట్ల ను గురువారం ప్రభుత్వం విడుదల చేసింది. రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన రైతు లు ధాన్యాన్ని విక్రయించారు. ఇందుకు సంబంధించి పల్నాడు జిల్లాలో 359 మంది రైతులకు రూ.6.29 కోట్లు, బాపట్ల జిల్లాలో 1200 మంది రైతులకు సుమారు రూ.18.24 కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించినా చేతిలో నగదు లేక.. రబీ ధాన్యం నగదు కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో వారికి ప్రభుత్వం తీపికబురు అందించింది.

మదినిండుగా.. బడి పండుగ

- ఆటపాటలు నృత్యాలతో విద్యార్థుల సందడి
- పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటిన తల్లిదండ్రులు
- మొక్కల పంపిణీ.. తల్లి పేరుతో నాటిన విద్యార్థులు

ఉత్సాహంగా మెగా పీటీఎం 2.0



వినుకొండ : బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెల్ఫీ బోర్డు వద్ద ఫొటో తీయించుకున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



రెంటచింతల : సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న బాలికలు



అమరావతి : అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పిల్లలతో కలిసి తల్లిదండ్రులు గురువారం పాఠశాలలకు తరలిరాగా ఉత్సాహపూరిత వాతావరణంలో మెగా పీటీఎం 2.0 జరిగింది. పచ్చని కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, రంగురంగుల కాగితాలతో పాఠశాలలను విద్యార్థులు అలంక రించి పండుగ వాతావరణం కల్పించారు. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేయగా.. పిల్లల నైపుణ్యాలను చూసి.. తెలుసుకుని పెద్దలు సంబరపడ్డారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు.. పూర్వ విద్యార్థులు.. ప్రజలు భాగస్వామ్యం పెంచి మరింత బలోపేతం చేసేందుకు విద్యాలయాల్లో నిర్వహించిన ఉపాధ్యాయులు.. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు వేడుకగా జరిగాయి. మదినిండుగా బడి పండుగ కోలాహలంగా జరిగింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం 2.0 వేడుకగా జరిగింది. తల్లిదండ్రులు.. అతిథిలకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. తల్లుల కాళ్లకు పూలతో పూజలు చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్‌కార్డులు అందజేశారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యేల నుంచి

(మిగతా 6లో)

- సత్తెనపల్లిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు.
- నకరికల్లు ఎస్‌వీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సరస్వతి విగ్రహం వద్ద పూజలు చేశారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులను అందజేశారు.
- వినుకొండ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడి భవిష్యత్‌లో వారు ఏం కావాలో అడిగి తెలుసుకున్నారు.
- అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. పాఠశాలలో అదనంగా వెయ్యి మంది విద్యార్థినులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- మాచర్ల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల, కారంపూడిలోని అంబేద్కర్ గురు కులంలో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు.
- నాదెండ్ల మండలం గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లా రావు పాల్గొన్నారు. దాతల సహకారంతో రూ.35 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.
- నరసరావుపేట మండలం లింగం గుంట్ల గ్రామంలోని శంకర భారతి పురం హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాస రావు, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సత్తెనపల్లి : ఉన్నత పాఠశాలలో మొక్కలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, డీఈవో చంద్రకళ



నాదెండ్ల మండలం గణపవరం ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్‌లతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



నకరికల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వస్వతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

శాకాంబరీదేవిగా బాలచాముండిక

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమి పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకాంబ రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగా యలు, పండ్లతో అమ్మవారిని అర్చకులు అలంకరించారు. ఖరీఫ్ సాగులో పంటలకు అధిక దిగుబడి రావాలని, రైతుల ను కరుణించేలా అమ్మవారిని కూరగాయలతో అలంకరించి నట్లు అర్చకులు తెలిపారు. శాకాంబరీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.





సభా స్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



పూర్తయిన సిట్టింగ్ ఏర్పాట్లు

నేడు వెలగపూడిలో జనాభా దినోత్సవం

హాజరుకానున్న సీఎం చంద్రబాబు.. భారీగా ఏర్పాట్లు

తుళ్లూరు(వెలగపూడి), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచి వాలయం సమీపంలో శుక్రవారం జరిగే ప్రపంచ జనాభా దినోత్స వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఆయా ఏర్పాట్లను గురువారం రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరి పీయూష్‌కుమార్, జా యింట్ సెక్రటరి అనంతశంకర్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవతేజ పరిశీలించారు. సభా స్థలి ఏర్పాట్లు, సిట్టింగ్, వాహనాల పార్కింగ్, తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమం విజయ వంతానికి అధికారులు సమ న్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవికుమా ర్, సీఆర్డీఏ ఈఈ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్, డీపీవో నా గసాయికుమార్, డీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐ సురేష్, తుళ్లూరు, గుంటూరు తూర్పు తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

నరసరావుపేట రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సంద ర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆల యంలో గురువారం గిరి ప్రదక్షిణ జరిగింది. నరసరావుపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు భారీగా తరలి వచ్చి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులు కోటయ్య స్వామికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గిరి ప్రదక్షిణ భక్తులకు అభ యాంజనేయ సాయిబాబా దేవాల యాల కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద విత రణ జరి గింది.



కోటప్పకొండ గిరి ప్రదక్షిణ దారిలో అన్నదానం చేస్తున్న భక్తులు

సాగర్‌కు జలకళ

- 540 అడుగులకు చేరిన నీటి మట్టం
- శ్రీశైలం నుంచి 1.20 లక్షల క్యూసెక్కులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం జలకళ సంతరించుకుంటోంది. శ్రీశైలం నుంచి 1.20 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. రెండు రోజుల్లో 22 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 541 అడుగులకు చేరింది. 189.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. 122.72 టీఎంసీలు వస్తే సాగర్ జలాశయం నిండుతుంది. శ్రీశైలం జలాశయంలోకి గురువారం 1,88,745 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. శ్రీశైలం గేట్లు తెరిచి, విద్యుత్ ఉత్పత్తి ద్వారా నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.



నాగార్జున సాగర్ జలాశయం

బర్లీ పొగాకు రైతులకు బాసట

◆ మంత్రి గొట్టిపాటి చొరవతో కొనుగోలు

మేదరమెట్ల జూలై 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మూరుమూల ప్రాంతం నుంచి బర్లీ పొగాకు అమ్మేందుకు మేదరమెట్లకు వచ్చిన రైతులకు మంత్రి రవికుమార్ బాసటగా నిలిచారు. అచ్చంపేట మండలం చెరుకుం పాలేనికి చెందిన రైతులు 350 పొగాకు బేళ్ల తీసుకుని మేదరమెట్ల జీపీఐ కంపెనీ వద్దకు వచ్చారు. అయితే సదరు కంపెనీ ప్రతినిధులు కొన్ని బేళ్ల తక్కువ ధరకు కొనుగోలు చేసి మిగిలిన వాటిని తిరస్కరించారు. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో గురువారం మేదరమెట్ల పర్యటనలో ఉన్న మంత్రి రవికుమార్‌ను రైతులు కలిసి తమ గోడు వినిపించారు. స్పందించిన మంత్రి జీపీఐ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోళ్లకు ఒప్పించారు. దీంతో రైతులు మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



జీపీఐ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

కందులు కొనండి

- దాల్ మిల్లర్ల సమావేశంలో కలెక్టర్
- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించి సమావేశం

నరసరావుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ధరలు తగ్గుతున్న నేపథ్యంలో రైతుల నుంచి కందులు కొనుగోలు చేయాలని దాల్ మిల్లర్లను కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. 'చేతి కంది ధరలేక' అనే శీర్షికతో కంది రైతుల కష్టాలపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై కలెక్టర్ స్పందించారు. దాల్ మిల్లుల నిర్వాహకులతో కందుల కొనుగోలుపై గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ, దాచేపల్లి మండలాల్లో రైతుల వద్ద ఉన్న కందులను మిల్లర్లు మెరుగైన ధర చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. వారంలోగా రైతులకు, మిల్లర్లకు ఆమోదయోగ్యమైన ధరను మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, ఆర్డీవోలు మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రాజెక్టులకు నిధులు

- నిధుల కేటాయింపునకు మంత్రి మండలి ఆమోదం
- పట్టాలెక్కనున్న వరికపూడిశెల, గోదావరి అనుసంధానం పనులు

రూ.6,399.95 కోట్లు మంజూరు

ప్రకటనలు.. శంకుస్థాపనల హడావుడితో వైసీపీ పాలకులు సరిపెట్టిన సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అటకెక్కిన సాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం పట్టాలెక్కనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టులకు బుగ్గవాగు అభివృద్ధి పనులకు కలిపి మొత్తం రూ.6,399.95 కోట్లు కేటాయింపులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నీటి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తే సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.



నకరికల్లు వద్ద గోదావరి అనుసంధానం ప్రాజెక్టుకు 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి కరువును శాశ్వతంగా జయించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ప్రాజెక్టుల పనులను పట్టాలెక్కించే దిశగా నిధులు మంజూ రు చేసింది. గోదావరి - పెన్నా నదుల అనుసంధానంలో తొలి విడతలో చేపట్టే గోదావరి జలాలు సాగర్ కుడి కాల్వకు తరలించే ఎత్తిపోతలు, వరికపూడిశెల పథకాలకు నిధులు మంజూరు చేసింది. బుగ్గవాగు గేట్లు పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయించింది. గోదావరి పెన్నా నదుల అనుసం ధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ కుడి కాల్వకు తరలించే పథకానికి 2018లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 9.61 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా ఈ పథకాన్ని రూపొందించింది. అమరావతి మండలం వైకుంఠ పురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుం చి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదా వరి నీటిని ఎత్తిపోతల ద్వారా (మిగతా 6లో)



వరికపూడిశెల నిర్మించే ప్రదేశం

ప్రాజెక్టు	నిధులు (రూ.కోట్లలో)
గోదావరి అనుసంధానం	6,020.15
వరికపూరిశెల	340.26
బుగ్గవాగు	39.54

2027 జనగణన..!

- కొన్ని నెలల్లో ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- జిల్లాల వారీగా రానున్న జనాభా లెక్కల స్పష్టత
- గణాంకాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళిక
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

8

సస్పెన్షన్ ఎత్తివేత

- విధుల్లో చేరిన 9 మంది మున్సిపల్ ఉద్యోగులు

'బర్డ్'లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు!

- త్వరలో స్ర్కీనింగ్ వైద్య శిబిరాలు
- ఎంపిక చేసిన రోగులకు శస్త్రచికిత్సలు
- బర్డ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నన్నపనేని సదాశివరావు వెల్లడి

6

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు

ప్రాజెక్టులకు నిధులు

(5వ పేజీ తరువాయి)



దెబ్బతిన్న బుగ్గవాగు రిజర్వాయర్ గేట్లు

తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. రూ.1,016 కోట్ల వ్యయం కాగల పనులు గతంలోనే పూర్తి అయ్యాయి. వైసీపీ అధికారంలో వచ్చాక ఈ పనులను పూర్తిగా నిలిపి వేసింది. ఈ క్రమంలో గోదావరి-బనకచర్ల అనుసంధానం చేసేందుకు ప్రణాళికను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. విడతల వారీగా నదుల అనుసంధానం పూర్తి చేయాలని నిర్ణయించి జలహారతి అని నామకరణం చేసింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలను జవహర్ కుడి కాల్వ ఆయకట్టు మళ్లించి 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఇందుకు సంబంధించి సుమారు 466 ఎకరాలు భూసేకరణ త్వరలోనే ప్రారంభం కానున్నది. పథకం పూర్తయితే సాగర్ ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారుతుంది.

వరికపూడిశెల కలకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యం కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు రూ.340.26 కోట్లు మంజూరు చేసింది. అధికారంలోకి వచ్చాక మూడేళ్లలో వరికపూడిశెల నిర్మిస్తామని యువగళం పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారు. అన్నట్లుగానే మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాలకు సాగునీరు అందించే పనులకు నిధులు కేటాయించారు. ప్రాజెక్టు అనుమతులు కేంద్ర ప్రభుత్వం నుంచి లభించడంతో త్వరలోనే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సమాయత్త మవుతోంది.

బుగ్గవాగు అభివృద్ధికి నిధులు

సాగర్ కుడి కాల్వలోని బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.39.54 కోట్లు కేటాయించింది. బుగ్గవాగు సామర్థ్యం పెంచాలని దశాబ్దాలుగా జిల్లావాసులు కోరుతున్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేయగా ఆ పనులు నిలిపివేసిన వైసీపీ పాలకులు బుగ్గవాగు సామర్థ్యాన్ని 7 టీఎంసీలకు పెంచుతామని చతికిల పడ్డారు.

మదినిండుగా.. బడి పండుగ

(5వ పేజీ తరువాయి)

వార్డు సభ్యుల వరకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహా అన్ని స్థాయిల అధికారులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతంపై నిర్ణయాలు తీసుకున్నారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, అభ్యాసన సామర్థ్యాలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను సమావేశ పరిచి వారితో తాడాట, కుర్చీలాటలు నిర్వహించగా వారంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీ, టగ్ ఆప్ వార్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల మధ్య సత్సంబంధాలు పెంపొందించి విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వెల్లడించారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులతో కలసి తల్లిదండ్రులు, అతిథులు భోజనం చేశారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి లోకేశ్ కృషి

➡ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో మంత్రి అనగాని

రేపల్లె, జూలై 10(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్లక్ష్య విధానాల వల్ల బలహీనపడిన విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 3వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరేంట్స్, టీచర్స్ మీటింగ్‌లో మంత్రి పాల్గొని, ప్రసంగించారు. దేశంలోనే తొలిసారిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, దాతలను ఒకే వేదికపై ఆత్మీయంగా కలిసేలా చేసిన పేరేంట్స్, టీచర్స్ మీటింగ్ రాష్ట్ర విద్యా వ్యవస్థలో కొత్త ఒరవడి సృష్టించిందన్నారు. ఈ సమావేశాల్లో 74,96,228 మంది విద్యార్థులు 1,49,92,456 మంది తల్లిదండ్రులు, 3,32,770 మంది టీచర్లు పాల్గొన్నారని తెలిపారు. భారతదేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒకే సమయంలో పీటీఎం 2.ఓ నిర్వహించడం విద్యా రంగంలోనే చారిత్రక మైలురాయిని పేర్కొన్నారు.



విద్యార్థులతో మంత్రి అనగాని సత్యప్రసాద్

గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా జరపలేదని, ఉపాధ్యాయులకు ఒక నెల జీతం కూడా సరైన సమయంలో వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన దాఖలాలు లేవని మంత్రి దుయ్యబట్టారు. కానీ కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసిందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు పోషక విలువలు, రుచి సుచి కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యను అందించేందు ఒకే క్లాసుకు ఒకే టీచర్ విధానంలో 9,600 మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పురపాలక సంఘంలో తాగునీటి సమస్య నెలకొందని, 15 రోజుల్లో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులతో కలిసి అనగాని మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాగిరెడ్డి, ఆర్డీఓ రామలక్ష్మి, కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటిశ్రీనివాసరావు, చైర్‌పర్సన్ కట్టా మంగా, తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి పర్యటన

● విద్యుత్ భవన్‌లో సమీక్ష సమావేశం

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పి.పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ శుక్రవారం జిల్లా కేంద్రం గుంటూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో రెవెన్యూ బకాయితో పాటు వ్యవసాయ కనెక్షన్‌లు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ఆర్‌డీఎస్ఎస్ పథకం పనుల పురోగతి, పీఎం సూర్య ఘర్ పథకం వంటి వివిధ అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సీఎండీ క్షేత్ర స్థాయిలో డివిజనల్, సెక్షన్ కార్యాలయాలను కూడా సందర్శించనున్నట్లు తెలిపారు.

చదువు, అభివృద్ధి సంతోష ప్రక్రియ

➡ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య) జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తమ సంస్థలు కృషి చేస్తాయని, చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖరీఫ్ రుణాల మంజూరులో జాప్యం వద్దు

● డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు రుణాల మంజూరులో ఎక్కడా జాప్యం చేయొద్దని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు బ్రాంచ్ మేనేజర్లకు సూచించారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం జిల్లాలోని 42 బ్రాంచ్‌ల మేనేజర్లు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌ల వారీగా రుణాలు, డిపాజిట్‌లు, బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రైతులకు రుణ మంజూరులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. పక్కాగా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అలానే రుణాల రికవరీపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పంట రుణాలతో పాటు ఇతర రుణాలను మంజూరు చేయాలని, డిపాజిట్‌లు పెంచి బ్యాంకు అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని దివానిర్దేశం చేశారు. బ్యాంకు సీఈవో సీహెచ్ అజయ్‌కిషోర్, జీఎంలు కృష్ణవేణి, వీవీఎస్ ఫణికుమార్, కె.మాధవి తదితరులున్నారు.



సమీక్షిస్తున్న చైర్మన్ మల్లికార్జునరావు, సీఈవో అజయ్ కిషోర్

'బర్డ్'లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు!

● జిల్లాలో త్వరలో స్క్రీనింగ్ వైద్య శిబిరాలు

● ఎంపిక చేసిన రోగులకు శస్త్రచికిత్సలు

● బర్డ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నన్నపనేని సదాశివరావు వెల్లడి

గుంటూరు మెడికల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేయించుకోవాలని భావించే పేద రోగులకు శుభవార్త. ఖరీదైన మోకీళ్ల మార్పిడి ఆపరేషన్‌లను ఉచితంగా చేసేందుకు తిరుపతికి చెందిన ప్రఖ్యాత ఆసుపత్రి "బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్ అండ్ రీహ్యాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్" (బర్డ్) ఏర్పాట్లు చేస్తోంది. ఇందు కోసం జిల్లాలో ప్రత్యేక స్క్రీనింగ్ వైద్య శిబిరాలను త్వరలో నిర్వహించనున్నారు. ఈ స్క్రీనింగ్ క్యాంపుల్లో గ్రేడ్-4 ఆర్థ్రైటిస్‌తో బాధపడే రోగులను గుర్తించి వారికి బర్డ్‌లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లకు ఎంపిక చేస్తారు. ఈ మేరకు జిల్లాలో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు బర్డ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు నన్నపనేని సదాశివరావు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డ్ మెంబర్‌గా వ్యవహరిస్తున్న ఆయనను, రెండు రోజుల కిందట బర్డ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా టీటీడీ దేవస్థానం నియమించింది. బర్డ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఇప్పటికే డాక్టర్ ఆదిత్ దేశాయ్, తమ్మిశెట్టి జాన కీదేవి సభ్యులుగా ఉండగా, మూడో సభ్యుడుగా గుంటూరు జిల్లాకు చెందిన నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావును నియమించారు. కీలకమైన ఈ పదవిని చేపట్టిన సదాశివరావును పలువురు అభినందించారు. 300 పడకలతో ఆర్థోపెడిక్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా విశిష్టమైన సేవలు అందిస్తున్న బర్డ్ దివ్యాంగులకు కాలిపర్స్‌ను అందజేస్తోంది. మోకీళ్ల మార్పిడితో పాటు పలు రకాల ఆర్థోపెడిక్ సర్జరీలను నిర్వహిస్తోంది. బోర్డ్ ఆఫ్ ట్రస్టీ మెంబర్‌గా ఎంపికైన సదాశివరావు గురువారం ఫోన్ ద్వారా ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మోకీళ్లు అరిగి రూ.లక్షలు ఖరీదైన నీ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేయించుకోలేని పేద రోగులకు ఉచితంగా ఈ ఆపరేషన్లు చేయిస్తామని ప్రకటించారు. బర్డ్‌లో అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో పది ఆపరే షన్ థియేటర్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.




నన్నపనేని సదాశివరావు

అనంతవరం ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు

రాజధాని గ్రామం అనంతరం కొండపై శ్రీదేవి భూదేవి సమేత మీసాల వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 కోట్లు కేటాయించడంలో బోర్డు సభ్యుడు సదాశివరావు కీలక పాత్ర పోషించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకుంది. సదాశివరావు ఆలయాన్ని సందర్శించిన నేపథ్యంలో రైతులు ఆలయ అభివృద్ధి గురించి ఆయన వినతి పత్రం అందజేశారు. మేలో జరిగిన టీటీడీ బోర్డు మీటింగ్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు నిధులు మంజూరు చేస్తూ తీర్మానం చేశారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి వైభవంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్ట్

● 96 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్

గురజాలటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. మే 3న రెంటచింతల మండలం మంచికల్లుకు చెందిన బొల్లెద్దుల కోటేశ్వరరావును పట్టణంలోని జాతీయ రహదారి పక్కనున్న జగనన్న కాలనీలో ఓ వ్యక్తి బెదిరించి బంగారం గొలుసు అపహరించాడు. కోటేశ్వరరావు గురజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. బర్మావత్ నాగరాజు అనే వ్యక్తిని గురువారం పట్టణ పోలీసులు పులిపాడు అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం బాలాజీ నగర్ తండాకు చెందిన నాగరాజు డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిసై.. డబ్బులు కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నాడు. రెక్కీ నిర్వహించి.. బైకుపై మహిళలు, పురుషుల మెడలోని బంగారు ఆభరణాలు దొంగిలించి పారిపోతుంటాడు. తెలంగాణతోపాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నాగరాజుపై కేసులు ఉన్నట్లు డీ ఎస్పీ జగదీష్ తెలిపారు. నాగరాజు నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 96 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

అంబటి మురళిపై కేసు నమోదు

పొన్నూరుటౌన్, జులై10(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణపై అర్బన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌పై అసత్య ప్రచారాలు సాగిస్తూ సమాజంలో అంబటి విద్వేషాలు రగిలిస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వీడియోలను మార్ఫింగ్ చేసి.. దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యర్థులను భూస్థాపితం చేస్తానని.. ఎమ్మెల్యే అన్నట్లుగా ప్రచారం చేస్తూ.. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మన్నవ గ్రామానికి సంబంధించి ఇద్దరి మధ్య జరిగిన గొడవను రాజకీయ దాడులకు ప్రేరేపించే విధంగా వ్యవహరించడంతోపాటు.. ఈ దాడులకు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు సంబంధం ఉందని పలుమార్లు అంబటి మురళీకృష్ణ ప్రచారం చేయడంతో.. తమ మనోభావాలు దెబ్బతిన్నాయని అహ్మద్ ఖాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ వీరనాయక్ గురువారం తెలిపారు.

44,205 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 41,480 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,205 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,114 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9700	11200
334	9500	12800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12700
273	----	-----	నెంబరు. 5	10000	13400
341	10000	13400	273	---	----
4884	----	---	341	10000	13500
సూపర్ 10	----	----	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13500	తేజ	10000	13400
షార్క్-1	---	--	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	----	----
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4800	7000



విద్యార్థినులకు మొక్కలు, గ్రీన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే ప్రవీణ్

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమూల మార్పులు తెచ్చిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం తల్లిదండ్రుల ఆధ్యాపకుల ఆత్మీయ సమావేశం అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల కొరత లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించిందన్నారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులచే మొక్కలు నాటించి గ్రీన్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు, తహసీల్దార్ డానియేలు, ఎంపీడీఓ పార్వతి, ఎంఈఓలు ప్రసాదరావు, శివబాబు, ప్రిన్సిపాల్ మేరికళ, కూటమి నేతలు పాల్గొన్నారు. అనంతరం అమరావతిలోని మిట్టమీద రామాలయం సమీపంలోని అన్నక్యాంటిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రవీణ్ శంకుస్థాపన చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● కలెక్టర్ అరుణ్ బాబు

సత్తెనపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ అరుణ్ బాబు అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినూత్న సంస్కరణలతో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం కూడా ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు కలెక్టర్ మొక్కలు అందించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలోని, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు.

అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం

పెదకూరపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మద్దినేని వెంకట సత్యనారాయణ, మండల టీడీపీ నేతలు భాష్యం ఆంజనేయులు, షేక్ ముంతాజ్, పాటిబండ్ల యోహాన్, షేక్ మిలటరీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు జరిగినట్టు తేలితే చర్యలు

● డీఆర్‌డీఏ పీడీ పీ ఝాన్సీరాణి

నకరికల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): వెలుగులో శ్రీనిధి రుణాలు లబ్ధిదారులు చెల్లించిన నగదు రుణాలు జమ చేయకుండా ఎవరైనా దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ పీ ఝాన్సీరాణి హెచ్చరించారు. గురువారం ఆమె నకరికల్లులో మాట్లాడుతూ కండ్లకుంటలో వెలుగు అక్రమాలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయని, అలాగే వెలుగు కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలను భార్యాభర్తలు నిర్వహించిన విషయం పై విచారణ జరిపిస్తామని తెలిపారు. వీవోఏలు, మండల సమాఖ్య రికార్డులన్నింటినీ పరిశీలించి విచారణ జరిపిస్తామన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు అందించేందుకు ఈనెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ విజయ కుమార్ గురువారం తెలిపారు. ప్రయాణీకులు సలహాలు, సూచనలను 9959225429 నెంబరుకు తెలపాలన్నారు.

చీమలమర్రి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జంపని రామాంజనేయులు

నకరికల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): చీమలమర్రి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జంపని రామాంజనేయులును నియమించినట్టు సీఈవో మహీపతి లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు.

నేడు ఏఎంసీ చైర్మన్‌గా వీరస్వామి బాధ్యతల స్వీకరణ

పిడుగురాళ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా తురకా వీరస్వామి బాధ్యతలు శుక్రవారం స్వీకరించనున్నట్లు యార్డు కార్యదర్శి కె ఈశ్వరరావు తెలిపారు. గురువారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ వీరస్వామి, కరాలపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ అనబోతుల యలమందారెడ్డిలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

పరస తాళ్ళూరు పీఏసీఎస్ చెర్‌పర్సన్‌గా రత్న కుమార్

పెదకూరపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండంలోని పరస తాళ్ళూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా ఏటుకూరి రత్నకుమార్‌ను ప్రభుత్వం నిమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. రత్నకుమార్ ఎమ్మెల్యే ప్రవీణ్‌ను గుంటూరులోని కలసి కృతజ్ఞతలు తెలిపారు. కల్లం సుందర రామిరెడ్డి, బండి ఆప్పారావులు కూడా ఎమ్మెల్యేని కలసి కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న రత్నకుమార్



మాచర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి

ప్రభుత్వ విద్యలో నాణ్యతకు పెద్దపీట

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యలో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, కజ్జం సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కృష్ణవేణి జూనియర్ కళాశాలలో పిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య ఆధ్వర్యాన జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు బూత్ ఇన్‌చార్జి సంబోజు వేణు, ఏఎన్‌యు కమ్యూనికేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నందూరి వెంకటరమణ, డైరెక్టర్ చిక్కాల శ్రీనివాసరావు, గుమ్మడి సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు. పట్టణంలోని 11వ బ్లాక్ ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం విజయలక్ష్మి పండిట్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో యాగంటి మల్లికార్జునరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, కిరీటిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ విద్యార్థులకు బహుమతులు అందించారు. వెల్దుర్తిలోని జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి పాల్గొన్నారు. 350 మంది విద్యార్థులకు సొంత ఖర్చుతో ప్లేట్స్‌ను అందించారు. వెల్దుర్తి కస్తూర్బా స్కూల్‌లో ప్రిన్సిపాల్ గంగా భవానిబాయి ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, ఎపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, షలుసు గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కారంపూడి పట్టణంలోని అంబేద్కర్ గురుకులంలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీట్ 2.0 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్,మాజీ అధ్యక్షుడు బొల్నేడి శ్రీనివాసరావు, ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, సొసైటీ అధ్యక్షుడు నాగారపు రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, కటికల బాలకృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీపీ గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్ మాట్లాడారు. ఒప్పిచర్ల హైస్కూల్‌లోనూ సమావేశం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య రూ.50 వేలు అందజేశారు. గడిపూడి వెంకటేశ్వర్లు రూ.25వేలు, కొండపల్లి హాస్పిటల్ నాగేశ్వరరావు రూ.10వేలు చొప్పున అందించారు.

● దుర్గి: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎంఈవో బెంజిమెన్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే దుర్గి జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన సమావేశంలో జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విద్యలో ఎంతో పురోగతి సాధిస్తున్నారన్నారు.

● రెంటచింతల: రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల మెగా పీటీఎం(2.0)పండుగకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కార్యక్రమానికి కరస్పాండెంటెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అలాగే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల స్పీచ్‌ను వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మేరి కనకం, ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు. అనిల్‌రెడ్డి, మర్రెడ్డి, రాంబాబు, పాపారావు, టీడీపీ నేతలు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులకు శ్రీకారం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థలో వినూత్న మార్పులకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్రమంతా పాఠశాలల్లో పండుగలా మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిలిచిపోతుందన్నారు. గురువారం నకరికల్లు ఎస్‌వీవీఆర్ జడ్పీహైస్కూల్లో మెగా పేరెంట్స్‌డేలో ఎమ్మెల్యే కన్నా ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తల్లులకు తమ పిల్లలచే వందనం చేయించారు.కార్యక్రమంలో డీవైఈవో ఏసుబాబు, డీఆర్‌డీఏ పీడీ పీ ఝాన్సీరాణి, తహసీల్దార్ కే పుల్లారావు, ఎంపీడీవో జీ కాశయ్య, హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కనుమూరి బాజీ చౌదరి, నాగోతు శౌరయ్య, వేల్పుల ఆవుల రాజు, ఆకుల పెద వెంకటేశ్వర్లు, షేక్ అలీబాషా, సర్పంచ్ పరస అంజమ్మ, బత్తిన శ్రీనివాసరావు, బత్తిన గంగయ్య, ఢీకొండ రామదాసు, కూరపాటి పూర్ణచంద్రరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు



మొక్కలు అందజేస్తున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని యరపతినేని నిఖిల్ తెలిపారు. స్థానిక జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే యరపతినేని ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేందుకు మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్నారన్నారు. పర్యావరణాన్ని పెంపొందించేలా ప్రతి విద్యార్థి మొక్కలు పెంచే అలవాటు చేసుకోవాలన్నారు. పలువురు విద్యార్థులకు గ్రీన్ కార్డు, మొక్కలను నిఖిల్ అందజేశారు. సమావేశంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, హెచ్‌ఎం కొత్త మల్లికార్జునరావు, ప్రత్యేక అధికారి రామాంజనేయులు, పాండురంగ శ్రీను, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, కనిగిరి శ్రీను, ఎల్‌వీఆర్, కోట హరి, వల్లెపు రామకృష్ణ, విజయసారధి పాల్గొన్నారు.

కన్నెగంటి స్మారక స్థూపం ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యే జూలకంటికి తెలగ అభ్యుదయ సంఘం వినతి



ఎమ్మెల్యే జూలకంటికి వినతిపత్రం అందిస్తున్న తెలగ అభ్యుదయ సంఘం సభ్యులు

మాచర్లటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు స్మారక స్థూపాన్ని రాష్ట్ర రాజదాని అమరావతిలో ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని తెలుగ అభ్యుదయ సంఘం సభ్యులు గురువారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కోరారు. వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ పరిశీలకుడు గంగిశెట్టి నరసింహారావు, తెలగ అభ్యుదయ సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్‌కుమార్, కృష్ణ, సత్యనారాయణ, నరసింహారావు, రుద్రాల రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు దాడి చేశాడంటూ సీపీఎం రాస్తారోకో

క్రోసూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మొగల్‌జాన్ తమ పార్టీ నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావుపై దాడి చేశాడని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం క్రోసూరులో రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించారు. దొడ్లేరులోని గ్రామీణ బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ బాధితులకు అండగా నిలిచిన తిమ్మిశెట్టి హనుమంతరావుపై మొగల్‌జాన్ దాడి చేశాడని బాధితుడు తెలిపారు. దాడికి నిరసనగా సీపీఎం జిల్లా నాయకులు గద్దె చలమయ్య, గుంటూరు విజయకుమార్, ఏపూరి గోపాలరావు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించారు. మొగల్ జాన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, సీఐ పి.సురేష్ సీపీఎం నాయకులను శాంతింపచేశారు.

ఎమ్మెల్యేని దుర్భాషలాడొద్దన్నందుకు సీపీఎం నాయకుడి దాడి..

క్రోసూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను దుర్భాషలాడుతున్న సీపీఎం నాయకుడు తిమ్మిశెట్టి హనుమంతరావుని ప్రశ్నించినందుకు తన పైనే దాడి చేశాడని మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్ ఆరోపించారు. ఈ సందర్భంగా తన చేతికి గాయమైందని, తాను సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. గోల్డ్ లోన్ బాధితులకి న్యాయం చేయాలని ఎమ్మెల్యేతో ఇప్పటికే మాట్లాడామని, ఈ విషయాన్ని సీపీఎం నాయకుడు హనుమంతరావుతో కూడా చెప్పామని, ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్యేపై బుర్భాషలాడి తనపై దాడి చేశారన్నారు. ఈ మేరకు క్రోసూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

పిడుగురాళ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కె.కుమారస్వామిని గురజాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, కేవీ నాగార్జున, దాసరి చిరంజీవి, శరత్‌బాబు, బండి వీరభద్రుడు, కర్రా చిన కోటేశ్వరరావు, చల్లా తిరుమలేశ్వరరావు, ఝాన్సీ, చల్లా అనిల్, లింగరాజు, నిమ్మల శ్యామలదేవి, ఏఎస్‌ఐ కృష్ణారావు, మందపాటి శ్రీనివాసరెడ్డి తదితరులు కుమారస్వామిని సన్మానించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 541.20 అడుగులు ఉంది. ఇది 190.83 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 3202 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 4204 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ 1500 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 8906 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,16,833 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి తిరిగి యేడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంఆ మండలంలోని సాయిబాబా మందిరాలలో, వైకుంఠపురంలోని భవఘ్ని ఆరామంలో గురుపౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో గురువారం జరిగాయి. భవఘ్ని ఆరామంలో వ్యాసమహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అమరావతిలోని సాయిబాబా ఆలయంలో బాబావారికి పూజలు నిర్వహించారు. ధ్యానబుద్ధ ప్రాంగణంలో శ్రీయోగ విద్యా ప్రాణశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజ జరిగింది. కమలా రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

గురుపౌర్ణమి వేడుకలు..

పిడుగురాళ్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక షిరిడీ సాయిబాబా దేవాలయంలో భక్తులు తెల్లవారుజాము నుండే ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గంగమ్మతల్లి దేవాలయంలో లక్ష పసుపుకొమ్ములతో అమ్మవారిని అలంకరించారు. చినఅగ్రహారంలోని శ్రీగంగాపార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి, పార్వతిదేవికి రుద్రాభిషేకం, మహాస్నపన, కుంకుమార్చన, దూపదీప నివేదన, నీరాజన మంత్ర పుష్పార్చనలు జరిగాయి.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయులు కీలకం

గురజాలటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో కీలకమని నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. గురువారం మండలంలోని గంగవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన మెగా 2.వో పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మాచర్లటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి అదృశ్యంపై పట్టణ పోలీసుస్టేషన్లో గురువారం కేసు నమోదైంది. పట్టణంలోని గౌడ కాలనీకి చెందిన ఉప్పుతోళ్ల బ్రహ్మయ్య బేల్‌దారీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. అతని కుమారుడు సిద్ధు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. కాగా గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో విద్యార్థి తండ్రి బ్రహ్మయ్య పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో వృద్ధురాలి మృతి

అచ్చంపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోగంటివారిపాలెం కృష్ణానదిలో పడి వేల్పూరు గ్రామానికి చెందిన బైసాని సుశీల(65) గురువారం మృతిచెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్నట్టు పలువురు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని వెలికితీసి సీఐ పీ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నకరికల్లు: ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగుతో భూసారం పెరుగుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి తెలిపారు. గురువారం నకరికల్లు మండలం చల్లగుండ్లలో చింతలచెరువు వెంకట రమణ కాంప్యాక్ట్ బ్లాక్‌లో వేసిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వీ అప్పలరాజు, బాజీబాబు, రేణుక, సుబ్బారెడ్డి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్ : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని భృగుబండ్లలో గురువారం సుపరిపాలనో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్తం...

● మాచర్లటౌన్: పట్టణంలోని శ్రీగంగా పార్వతి సమేత శ్రీచింతల రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలకరించారు. విఘ్నేశ్వర, లక్ష్మీ గణపతి, గాయత్రి హోమం జరిపారు.

● రెంటచింతల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న ఓ యువకుడు బుధవారం రాత్రి గుంటూరు ప్రభుత్వవైద్యశాలలో మృతిచెందాడు. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున కథనం మేరకు.. రెంటచింతల ఆంజనేయస్వామి మాన్యంకు చెందిన దాసరి రాజశేఖర్, తాయ నరసింహారావులు ద్విచక్రవాహనంపై వస్తూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆర్టీసీ బస్సును ఈ నెల 5న ఢీకొట్టగా తీవ్రగాయాలై జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ నరసింహారావు మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

● రెంటచింతలలో గిరిజన గురుకుల కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని టీడీపీ రాష్ట్ర గిరిజన సంఘ అధ్యక్షులు ఎం.ధారునాయక్ ఎమ్మెల్యే జూలకంటిని కోరారు. గురువారం రెంటచింతలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మెగా పీటీఎం(2.0) కార్యక్రమంలో శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డితో కలిసి పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉత్తమ విద్యనందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండలాధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్ అన్నారు. మండలంలోని విజయపురిసౌత్‌లో ప్రభుత్వ హైస్కూల్, క్యాంపు-1, -2, డాక్టర్ బీఆర్ అంబ్కేర్ బాలికల పాఠశాల, ఏపీఆర్‌జేసీ కళాశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

● విజయపురిసౌత్‌లో సత్యసాయి ప్రేమమందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ ధర్మకర్త కె.శ్రీహరిప్రసాద్ ఘనంగా నిర్వహించారు.

● మాచర్ల రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది బత్తుల బాబురావు జనసేన పార్టీలో చేరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన జనసేన కండువా కప్పుకున్నారు.

● మాచర్లటౌన్: గురుపౌర్ణిమ సందర్భంగా బీజేపీ నేతలు గురువారం ఆచార్య చంద్రమౌళి రామనాథశర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు కాంతిక్రుమార్, బొగ్గవరపు మస్తాన్‌రాజు, కనకంటి కోటేశ్వరరావు, యేచూరి సురేష్, మారం వంశీకృష్ణ, కార్యదర్శి అన్నవరపు ఏడుకొండలు, బి.రామారావు, జి.నీరజ్‌కుమార్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి: పట్టణంలోని సాయి దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య వీధిలోని షిర్డీసాయి, సత్యసాయి మందిరం, దేవాలయాల కూడలిలోని షిర్డీసాయి ఆలయం, ఎస్‌ఎస్పీ కాలనీలోని బాలసాయి మందిరంలో స్వామివారికి ప్రత్యేకపూజలు జరిపారు. కార్యక్రమంలో తుమ్మేపల్లి నాగేశ్వరరావు, కొల్లిపర వెంకటసుబ్బారావు, వెచ్చా వరలక్ష్మణరావు, అమరయ్య, కృష్ణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శంకర్, విశాలాక్షీ పాల్గొన్నారు.

● క్రోసూరు: గురుపౌర్ణమి వేడుకలు గురువారం క్రోసూరు షిరిడీసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

● క్రోసూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు సందడిగా జరిగాయి. పీసపాడులోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు పాల్గొన్నారు. కేజీబీవీలో జడ్పీటీసీ సభ్యురాలు షేక్ జెమీలా పాల్గొన్నారు.

● అచ్చంపేట: అచ్చంపేట ఎస్సీ కాలనీ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కేసీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, ఎస్.సాయికుమారి, కోటయ్య, వెంకటరావు, మహేష్ పాల్గొన్నారు. కేజీబీవీ, జడ్పీహైస్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ జరిగింది.

● బెల్లంకొండ: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషిచేస్తోందని రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

● పెదకూరపాడు: పెదకూరపాడులోని మోడల్ స్కూల్‌లో టీడీపీ నాయకుడు అర్తిమళ్ళ రమేష్ సతీమణి నళిని జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ చేశారు.

● దాచేపల్లి: ఆషాడ పౌర్ణమి సందర్భంగా నారాయణపురంలో ఎంఎస్ పేటలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మ తల్లి ఆలయంలో చండీయాగం నిర్వహించారు.

● దాచేపలి: బడి పండుగ కార్యక్రమం దాచేపల్లి మండల ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా జరిగింది. తల్లిదండ్రులను సమావేశ పరచి వారితో తాడాట, కుర్చీలాట నిర్వహించారు. కార్యక్రమానికి కూటమి నేతలు హాజరయ్యారు.

● వానదేవుడు కరుణించాలని కోరుతూ భక్తులు కప్పతల్లి ఉత్సవం నిర్వహించారు. దాచేపల్లి నగర పంచాయతీ జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న గణపతి ఆలయంలో మహిళలందరూ జలబిందెలతో స్వామివారికి జలాభిషేకం చేశారు.

● మాచవరం: మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో గురువారం టీచర్స్, పేరెంట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కూటమి నాయకులు, ఎంఈవో శ్రీధర్, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు: నకరికల్లు ఎస్‌వీవీఆర్ జెడ్పీహైస్కూల్లో మధ్యాహ్న భోజనం బాగాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజనం ప్లేట్లు పట్టుకొని ఉపాధ్యాయుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. భోజనం సక్రమంగా వండేలా చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు పేర్కొన్నారు.

● సత్తెనపల్లి: గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని షిరిడీ సాయి దేవాలయం, పట్టణంలోని శరభయ్య క్రీడా మైదానం షిరిడీ సాయి దేవాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు చేశారు.

● ఆషాడ మాసంలో భాగంగా పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మతల్లి ఆలయంలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పోలేరమ్మ తల్లిని శాకాంబరి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

● రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమంలో పండుగలా నిర్వహించారు. కార్యక్రమం లో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, చొక్కా గాలయ్య, హెచ్‌ఎంలు, ఎం ఈవో మల్లికార్జునశర్మ, పాల్గొన్నారు.

● నకరికల్లు: అద్దంకి-నార్కెట్ పల్లి రహదారి పక్కనే చల్లగుండ్ల శివారులో షిరిడీసాయి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.తహసీల్దార్ పుల్లారావు, ఎస్‌ఐ సురేష్ ప్రత్యేకపూజలు చేశారు.

● యంగ్‌బుల్ రేడింగ్ సెంటర్ నరసింగపాడులో ఏపీహెచ్ నకరికల్లు సంయుక్తంగా గురువారం పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కే రామారావు, వైవీఆర్‌సీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం నాగేశ్వరరావు, పశు వైద్యశాల ఏడీ డాక్టర్ బీ వెంకటేశ్వర్లు నాయక్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ కరుణాకరరెడ్డి, డాక్టర్ వంశీ ప్రసాదు, డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బంధం..బాధ్యత..భరోసా..!



నకరికల్లు పాఠశాలలో పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లులు..



చిలువూరులో బిడ్డతో కలిసి భోజనం చేస్తున్న తల్లి

పాఠశాలల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) 2.0 ఒక పండగ వాతావరణం తలపించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు.. ప్రజా ప్రతినిధులను, పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయడంతో.. బంధం, బాధ్యత, భరోసా వికసించాయి. పిల్లల ఎదుగుదలను, నైపుణ్యాలను తెలుసుకుని..తల్లిదండ్రులు.. సంతోష పడ్డారు. ఆనందంగా వారే పిల్లలై.. ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తామేం చేస్తున్నామో.. చేయాలో వివరిస్తూ.. తమ బాధ్యతను మరోసారి గుర్తెరిగారు. ప్రజా ప్రతినిధులు విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, వసతుల కల్పనకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ కల్పిస్తామని భరోసా కల్పించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన బడి అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పూర్వ విద్యార్థులు చెప్పుకొచ్చారు. మొత్తం మెగా పీటీఎం 2.0.. మెగా విజయవంతమైంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



కర్లపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో మొక్క అందుకున్న సంతోషంలో..



గుంటూరులోని పాఠశాలలో ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు



వేమవరం పాఠశాలలో హాజరైన తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు



సత్తెనపల్లి ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా తాడు లాగుతున్న తల్లులు

2027 జనగణన..!

- ● రెండేళ్లలో ప్రారంభమయ్యే అవకాశం
- ● జిల్లాల వారీగా రానున్న జనాభా లెక్కల స్పష్టత
- ● గణాంకాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళిక
- ● నేడు ప్రపంచ జనాభా దినోత్సవం





ఉమ్మడి గుంటూరు జిల్లా మ్యాపు..

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2011 నుంచి జనాభా లెక్కలు తేల్చకపోవడంతో.. జిల్లాలో జనాభాపై స్పష్టత లేకుండా ఉంది. కేవలం ప్రొజెక్షన్స్ మాత్రమే జిల్లా యంత్రాంగం వద్ద అందుబాటులో ఉంది. దీంతో సంక్షేమ, అభివృద్ధి ప్రణాళికలు, కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడంలో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పదేళ్లకోసారి జనాభ లెక్కలు దేశ వ్యాప్తంగా జరుగుతాయి. 2021 జనగణన కరోనా కారణం వల్ల ఆగితే..మరో వైపు రాజకీయ రంగు అంటుకుంది. కొన్ని రాజకీయ పార్టీలు ప్రతిఘటించడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. ఎట్టకేలకు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం తాజాగా జనాభా లెక్కలకు ఆదేశాలు జారీ చేసింది. జనగణన 2027లోనే జరిగే అవకాశం ఉంది.

యువతకు సాధికారత..

జూలై 11న ప్రపంచ జనాభ దినోత్సవాన్ని జరుపుతారు. 1987లో ఇదే తేదీన ప్రపంచ జనాభ ఐదు బిలియన్లకు చేరుకోవడంతో ఆ రోజు నుంచి ప్రతి సంవత్సరం వరల్డ్ పాపులేషన్ డే నిర్వహిస్తున్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం, మానవ హక్కులు వంటి వివిధ జనాభ సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యం. కాగా ఏటా ఏదో ఒక ఇతివృత్తాన్ని యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రకటిస్తారు. న్యాయమైన, ఆశాజనకమైన ప్రపంచంలో తాము కోరుకునే కుటుంబాలను సృష్టించుకోవడానికి.. యువతకు సాధికారమివ్వడం అనే ఇతివృత్తంతో 2027 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరపాల్సిందిగా ఐక్యరాజ్య సమితి ఆదేశించింది.

2011లో ఉమ్మడి గుంటూరు జనాభా

ఉమ్మడి గుంటూరు జిల్లా జనాభా.. 2011 జగన గణన ప్రకారం 48,87,813 మందిగా తేల్చారు. అందులో మహిళలు 24,40521, పురుషులు 24,47,292 మందిగా ఉన్నారు. అప్పటి వరకు ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మధ్యన ప్రతి పదేళ్ల కోసారి జనాభ పెరుగుదల నమోదయ్యేది. అనంతరం కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెరగడంతో.. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు అన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు కూడా సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. బాగా వయస్సు మీద పడిన తర్వాత పురుషులు, మహిళలు పెళ్లి చేసుకొంటున్నారు. అప్పటికే వయస్సు మీరిపోతుండటంతో పెళ్లి కాని ప్రసాదులు మిగిలిపోతున్నారు. ఒకవేళ పెళ్లి అయినా చాలా సంవత్సరాల పాటు పిల్లలు పుట్టక మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వాలు కూడా ఒకరిద్దరికే సంతానం పరిమితం చేయాలని చెప్పేవి. నేడు ఎక్కువ మందిని కనాలని ప్రజాప్రతినిధులు బహిరంగ సభల్లోనే పిలుపునిస్తున్నారు. మన శక్తి అంతా యువతేనని, దాంతోనే ప్రపంచంలో అగ్రగామిగా ఎదగొచ్చని చెబుతున్నారు.

విస్తరిస్తున్న పట్టణాలు

కాగా జనసాంద్రత పెరుగుతున్న కారణంగా పల్లెల నుంచి పట్టణాలకు వలసలు రెట్టింపు అయ్యాయి. అలానే పట్టణ ప్రాంతాలు క్రమేపి విస్తరిస్తున్నాయి. దీంతో పొలాలు కాస్త రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. కొత్తగా పొలాలు సాగులోకి రాని పరిస్థితి ఏర్పడింది. గుంటూరు నగరాన్ని తీసుకొంటే అమరావతి రోడ్డు, ఏటుకూరు రోడ్డు, పొన్నూరు రోడ్డు, నల్లపాడు, పెదపలకలూరు, నందివెలుగు రోడ్ల వైపు భారీగా పట్టణం విస్తరించింది. మంగళగిరి, తాడేపల్లి అయితే ఒకవిధంగా కలిసిపోయాయి. అమరావతి రాజధాని కారణంగా ఈ రెండిటిని ఒక మునిసిపల్ కార్పొరేషన్‌గా చేయడంతో అక్కడొక నగరం రూపాంతరం చెందుతోంది. త్వరలో అమరావతి రాజధాని నగరం అందుబాటులోకి రానుంది. తెనాలి, నరసరావుపేట, పొన్నూరు, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల పట్టణాలు విస్తరిస్తున్నాయి.

సస్పెన్షన్ ఎత్తివేత

● విధుల్లో చేరిన 9 మంది మున్సిపల్ ఉద్యోగులు

చిలకలూరిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీలో గతంలో జరిగిన రూ.34 లక్షల కుంభకోణంలో సస్పెండ్ అయిన 9 మంది ఉద్యోగులను గుంటూరు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు గురువారం తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. వీరంతా వేర్వేరు మునిసిపాలిటీలలో ప్రస్తుతం పని చేస్తున్నారు. వీరిలో నరసరావుపేట మున్సిపాలిటీకి చెందిన నలుగురు, చిలకలూరిపేటకు చెందిన ఇద్దరు, వెంకటగిరికి చెందిన ఇద్దరు, చీరాలకు చెందిన ఒకరు ఉన్నారు. కందుకూరులో మునిసిపల్ మేనేజర్‌గా పనిచేసిన విజయలక్ష్మి సస్పెన్షన్ ఇంకా కొనసాగుతోంది. ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేసినప్పటికీ వారిపై విచారణ కొనసాగుతుంది.

అసలు ఏం జరిగిందంటే..

చిలకలూరిపేట మునిసిపల్ ఖజానాకు డబ్బు జమ చేయడానికి వచ్చిన ప్రజలకు నకిలీ రసీదులు ఇచ్చి.. రూ.34,34,397 కాజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణంలో.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గంగా భవాని ప్రధాన బాధ్యురాలిగా అధికారులు గుర్తించారు. ఆమెపై పోలీసు కేసు కూడా నమోదైంది. చాలా కాలంగా గంగా భవాని పరారీలో ఉంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో టీడీపీ కౌన్సిలర్లు అధికారులను ఈ అంశంపై నిలదీశారు. అధికారులు స్పష్టత ఇవ్వకుండా కాలం గడిపారు. ఈలోగా రూ.12 లక్షల నగదు ఖజానాకు జమ అయ్యింది. ఇంకా రూ.22 లక్షలకు పైగా జమ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దీనిపై దృష్టి సారించారు. ప్రాథమిక విచారణ జరిగింది. మొత్తం 15 మంది మున్సిపల్ సిబ్బంది దీనికి బాధ్యులని విచారణలో తేల్చారు. వీరిలో ఒకరు చనిపోయారు. పలువురు వేర్వేరు మునిసిపాలిటీలకు బదిలీ అయ్యారు. వీరిలో పది మందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో నలుగురు ఉన్నతాధికారులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. సస్పెండ్ అయిన ఉద్యోగులందరూ కలిసి రూ.22 లక్షల పెండింగ్ మొత్తాన్ని మునిసిపాలిటీకి ఇటీవలే జమ చేశారు. దీనితో ప్రస్తుతానికి సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ కుంభ కోణంపై సమగ్ర విచారణ జరిపించాలని మునిసిపల్ శాఖ మంత్రి పి. నారాయణకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇటీవలే లేఖ రాశారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ కోరుతూ మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని రాసిన లేఖను కూడా ఆయన మంత్రి నారాయణకు పంపించారు.

ఆంధ్రప్రదేశ్ మీ అయ్య జాగీరు కాదు

- ● దేశంలో, ఏపీలో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోంది
- ● జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా
- ● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెల్లడి

మాచవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రప్రదేశ్ మీ అయ్య జాగీరు కాదు... దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగం ఎలా నడుస్తుందో ఆంధ్రప్రదేశ్‌లో అదే రాజ్యాంగం నడుస్తుంది, మీ తాత రాజారెడ్డి రాజ్యాంగం ఇక్కడ నడవదు.' అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి మాచవరం మండలంలోని శ్రీ రుక్మిణీపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తల్లికి వందనం నగదు ఎంత మంది పిల్లలకు వచ్చిందని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల యోగ క్షేమాల తెలుసుకుంటూ.. ప్రజలను ఉత్సాహపరిచారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కర పత్రాలను అందజేసి, వాటి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారని తెలిపారు. అదే విధంగా గురజాల నియోజక వర్గంలో కూడా ఇప్పటికే సుమారు రూ.800 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అందించటం జరిగిందన్నారు. రాష్ట్రం విడి పోయినప్పుడు చంద్రబాబు నాయుడుని ఏపీలోకి తీసుకురావడం గురజాల నియోజక వర్గం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు.



దివ్యాంగురాలు రాజేశ్వరికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

అప్పుడు రూ.3వేలు.. ఇప్పుడు రూ.6 వేలు

గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగురాలు కింద మూడు వేలు రూపాయలు తీసుకున్నానని, కూటమి ప్రభుత్వం రాగానే ఆరు వేల రూపాయలు తీసుకుంటున్నానని శ్రీ రుక్మిణీపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు రాజేశ్వరి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు చెప్పింది. పుట్టుకతోనే దివ్యాంగురాలై నడవలేని స్థితిలో ఉన్న రాజేశ్వరి పరిస్థితిని గమనించిన యరపతినేని నేల మీద కూర్చొని ఆమె ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ విషయాలు తెలుసుకున్నారు. సర్టిఫికెట్‌లో 90 శాతం వైకల్యం ఉందని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చింది. రూ.15వేలు పింఛన్ వచ్చే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని యరపతినేని దివ్యాంగురాలికి హామీ ఇచ్చారు.

జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా

అధికారంలో ఉన్నా, అధికారంలో లేకున్నా తనను ఎప్పుడూ నియోజక వర్గ ప్రజలు ఎమ్మెల్యేగానే చూశారని, మాజీ ఎమ్మెల్యేగా ఎప్పుడూ చూడలేదన్నారు యరపతినేని. పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని సభలో యరపతినేని తెలిపారు. శ్రీ రుక్మిణీపురంలో తొలిసారి 1994లో ఎమ్మెల్యే అయిన తర్వాత తానే తారు రోడ్డు వేయించానని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖరరెడ్డి, పిడుగురాళ్ళ మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరాస్వామి, స్థానిక నాయకులు దేశబోయిన అప్పారావు, తుల్లిబిల్లి రాధాకృష్ణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ కోటయ్య, తుల్లిబిల్లి అనసయ్య, పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు కాంట్రాక్టర్లకు తీపి కబురు..

- ● ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లులకు మోక్షం
- ● 2014- 19 పనులకు.. రూ. 180 కోట్లు విడుదల
- ● నెల రోజుల్లో మెటీరియల్ సప్లయర్స్‌కు అందించే అవకాశం

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల కోసం మెటీరియల్ సప్లై చేసిన చిరు కాంట్రాక్టర్లకు కేంద్రం తీపి కబురు చెప్పింది. 2014- 19 మధ్యన జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో జరిగిన పలు పనులకు సంబంధించి పెండింగులో ఉన్న బకాయి రూ.180 కోట్లను కేంద్రం విడుదల చేసింది.

గత ప్రభుత్వం కక్ష సాధింపు..

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో భాగంగా 2014- 19 మధ్య చిన్న స్థాయి మెటీరియల్ సప్లయర్స్ చేపట్టిన రూ. 250- 300 కోట్ల విలువైన పనులకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి అవలంబించింది. సాఫ్ట్‌వేర్ మార్పులతో పాటు, సప్లయర్ల బిల్లులు మొత్తం ఆపివేయడం జరిగింది. గత ఆరు సంవత్సరాలుగా వీరికి ఒక్క పైసా బిల్లులు కూడా చెల్లించలేదు.

నెల రోజుల్లో చెల్లింపులు..

కూటమి బాధ్యతలు స్వీకరించిన తరువాత కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య సమన్వయం జరిగి, పాత సాఫ్ట్‌వేర్‌ను తిరిగి అమలులోకి తీసుకొచ్చారు. 4.3 లక్షల పనుల్లో 3.5 లక్షల పనులను తిరిగి గుర్తింపులోకి తెచ్చి వాటికి నిధులు మంజూరయ్యేలా చేశారు. మిగిలిన పనుల్లోని సాంకేతిక సమస్యలను పరిశీలించి పరిష్కరించడంపై చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే దాదాపు రూ.180 కోట్ల పెండింగ్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన మ్యాచింగ్ గ్రాంట్స్ కేటాయించి, వచ్చే 30 రోజుల్లోగా అన్ని బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేలా గ్రామీణాభివృద్ధి శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు మంత్రివర్గ స్థాయిలో జరిగిన సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో రూ. 5 నుంచి రూ.15 లక్షల మేర బిల్లులు పెండింగ్ ఉన్న 3.5 లక్షల మంది మెటీరియల్ సప్లయర్స్‌కు న్యాయం జరుగుతుందని తెలుస్తోంది.

న్యాయం చేసిన కూటమి ప్రభుత్వం: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అంశంపై కేంద్రం, రాష్ట్రం మధ్య సమర్థమైన సమన్వయం నెలకొల్పడంలో సీఎం చంద్రబాబు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, కూటమి ఎంపీల చొరవ కీలకంగా ఉందన్నారు. జరిగిన పనులను జరగలేదంటూ వైసీపీ గడిచిన ఐదేళ్లలో ఆ బిల్లులను తొక్కి పెట్టినప్పటికీ మెటీరియల్ సప్లయర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. కక్ష సాధింపులు ఎల్లకాలం చెల్లవని మరోసారి రుజువైందని మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు.

మొన్న అలా.. నేడు ఇలా..!

● ప్రభుత్వ డొంక రోడ్డు ఆక్రమణ ● ఆంధ్రజ్యోతి కథనంతో వెలుగులోకి ● రైతుల నుంచి వ్యతిరేకత



సిమెంటు రోడ్డు వేసి.. గోడ కట్టేసిన ఐవోసీ

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డొంక రోడ్లపై ప్రైవేటు వ్యక్తులతో పాటు... బడా కార్పొరేషన్ల కన్ను కూడా పడింది. తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంట ఉన్న ఐఓసీ వెనుక ఉన్న సర్వే నంబరు 255, 275-1ఎ, 302, 316-1లలో ఉన్న 2.04 ఎకరాల ప్రభుత్వ భూమిని తమకు కేటాయించాలని ఓ ఎమ్మెల్యే బంధువుకు చెందిన స్థిరాస్తి వ్యాపారి ఏకంగా రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన రైతులు ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకి కేటాయించ వద్దు అంటూ వ్యతిరేకతను తెలియజేస్తూ అర్జీలు ఇచ్చారు. తాజాగా అదే జాతీయ రహదారి వెంట ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ రైతుల పొలాలకు వెళ్లే డొంక రోడ్‌ను సీసీ రోడ్‌గా మార్చుకొని రైతులు వారి పొలాల వైపు వెళ్లకుండా అడ్డుగోడను నిర్మించారంటూ పలువురు రైతులు గుంటూరు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సదరు రైతుల ఫిర్యాదు ప్రకారం సర్వే నెంబర్ 319-1ఎ, 320 -1డీఏ, 313-2బి భూములలో తమ పొలాలు ఉన్నాయని, అటు వైపు వెళ్ళడానికి పాత జాతీయ రహదారి నుంచి ఆర్.ఎస్. నెంబర్ 303లో 39 సెంట్లు ప్రభుత్వ డొంక దారి ఉందని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆ భూమిలో ఐఓసీ అడ్డుగా గోడ నిర్మించడం వల్ల, తమ పొలాలకు వెళ్ళడానికి ఇబ్బంది పడుతున్నామని, కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు తీసుకొని, పొలాలకు వెళ్లే డొంక దారిని పునరుద్ధరించాలని రైతులు కోరారు. రాజధానిలో ఎకరం భూమి రూ. ఐదు కోట్లకు పైగా ఉండటంతో ఎవరికి వారు ప్రభుత్వ భూమి కనిపించిందే తడవుగా పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఐవోసీ మినహాయింపు కాకపోవడం కొసమెరుపు.

రప్పా రప్పా అంటే.. ప్రజలు చిత్తుగా ఓడిస్తారు

● హింసను ప్రేరేపించడమే జగన్ ధ్యేయం ● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల,జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలంటే గౌరవం లేదని, నోటికి ఏదొస్తే అది మాట్లాడడం, హింసను ప్రేరేపించి జనాన్ని చంపడం వైసీపీ నైజమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. 11 సీట్లిచ్చి జనం ఛీకొట్టినా ఇంకా వైసీపీ నేతలకు సిగ్గురాలేదన్నారు. ఓ మహిళా ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. గురువారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీసీ నాయకులు రప్పా రప్పా అంటూ ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావని దుయ్యబట్టారు. మామిడికి గిట్టుబాటు ధరతో పాటు టన్నుకు రూ.4 వేల రాయితీని సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్ పర్యటనకొస్తే ప్రాణాలు పోవాల్సిందేనని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, శౌరెడ్డి, రామకృష్ణ, రాయపరెడ్డి,వెన్నా కృష్ణారెడ్డి, నాళం పెదబాబు, ప్రభురాజ్, మందలపు హనిమిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, సిద్దయ్య, దానయ్య, కోటేశ్వరరావు, సాయి పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి జాతీయ అవార్డు



డిజైన్‌లో నిమగ్నమైన కర్నాటి మురళి

సత్తెనపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి మురళి వీవింగ్‌లో జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. 40 సంవత్సరాలుగా చేనేతలో మురళీ వివిధ డిజైన్‌లు తయారు చేస్తున్నాడు. టై అండ్ డై డిజైన్ చేయడంలో అతను సిద్ధహస్తుడు. అమరావతిలోని నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ డిజైన్‌లో మురళి శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మురళీ మల్టీ డైమండ్ డిజైన్ చారిని తయారు చేశాడు. ఆ చారిని విజవాడలోని వీవర్స్ సర్వీస్ సొసైటీకి పంపించాడు. అక్కడ మురళీ డిజైన్‌ను గుర్తించిన అధికారులు ఢిల్లీలోని వీవర్స్ సర్వీస్ సెంటర్‌కు డిజైన్ వివరాలను పంపించారు. అక్కడ అధికారులు వీవింగ్ సెక్షన్‌లో మురళిని జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఆగస్టు 7న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా మురళీ అవార్డు అందుకోనున్నారు. 30 సంవత్సరాలుగా వివిధ డిజైన్‌లలో చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నట్టు మురళీ గురువారం రాత్రి ఆంధ్రజ్యోతికి తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషానిచ్చిందన్నారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు చిలకలూరిపేట విద్యార్థి ఎంపిక

చిలకలూరిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్ఎన్ఎస్ సీవీఎస్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి డి.రాజ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన పోటీలలో పల్నాడు జిల్లా జట్టులో మంచి ప్రతిభ చూపడంతో ఈ నెల 12 నుంచి అనంతపురం జిల్లా కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత తెలిపారు. ఎంపికైన రాజాను విద్యా సంఘం అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు, కార్యదర్శి ఎం.శివానంద కుమార్, సహాయ కార్యదర్శి బేతంచర్ల రామకోటేశ్వరరావు, కోశాధికారి బచ్చు రామలింగేశ్వరరావు, పీడీ ప్రవీణ్ గురువారం అభినందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఆర్టీసీ డిపో పరిధిలోని చిలకలూరిపేట యడ్లపాడు, నాదెండ్ల మండలాల ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సూచనలను, సలహాలను శుక్రవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు జరిగే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తెలియచేయవచ్చునని ఆర్టీసీ డీఎం ఎస్.రాంబాబు గురువారం తెలిపారు. 99592 25427కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

యడ్లపాడు, జూలై 10 (ఆంధ్రజోతి): మండలంలోని వంకాయలపాడు గ్రామ శివారులోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.14,730లు నగదు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామని పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

ఈనాం భూములకు అన్నదాత సుఖీభవ వర్తింపు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

శావల్యాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వేలో జరిగిన తప్పుల కారణంగా శావల్యాపురం మండలంలోని కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు, పిచికలపాలెం గ్రామాలకు చెందిన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కోల్పోయారు. వారిలో చాలామంది రైతులవి పట్టాభూములు అయినప్పటికీ పట్టాదారు పాసుపుస్తకంలో ఈనాం భూములుగా నమోదయ్యాయి. ఈ కారణంగా వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలోనే సుమారు 200మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కోల్పోయారు. జూన్ 17వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంను ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా ప్రభుత్వం ఈనాం భూములపై విచారణ జరిపి రీ సర్వేలో తప్పుగా నమోదైన రైతులందరినీ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించి అర్హుల జాబితాలో చూపారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతిని పలువురు ప్రశంసించారు.

నలుగురు పంచాయతీ కార్యదర్శుల బదిలీ

శావల్యాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులను బదిలీచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య గురువారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ వేల్పూరులో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 కార్యదర్శి ఆళ్ళ యుగంధర్‌ను ఈపూరు మండలం గుండేపల్లి గ్రామానికి, బొందిలిపాలెంలో విధులు నిర్వహిస్తున్న నందం బాలపరమేశ్వరరావును తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి, ముండ్రువారిపాలెంలో విధులు నిర్వహిస్తున్న గుంజి వాసును చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి, కొత్తలూరులో విధులు నిర్వహిస్తున్న చేజర్ల శ్రీనివాసరావును ఇదే మండలం ముండ్రువారిపాలెంకు బదిలీ చేసినట్లు తెలిపారు.


అరుణాచలంలో వినుకొండ భక్తుల అన్నదానం

వినుకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రమైన తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం) క్షేత్రంలో పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున అరుణాచలంలోని గిరివలయం రోడ్డులోని వాయులింగం వద్ద అన్నదానం జరుగుతుందని తెలిపారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన కార్యదర్శి

ఈపూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈపూరు శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ సందర్శించి పుస్తకాలను, రికార్డులను పరిశీలించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి


ఆంజనేయులు (ఫైల్‌ఫొటో)

వినుకొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీటికుంటలోపడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గోకనకొండ సమీపంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బహిర్భూమికి వెళ్లిన పాలపర్తి ఆంజనేయులు (45) ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడి మృతిచెందాడు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు గుంటలోని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య యోగేశ్వరమ్మ, కుమారుడు అనిల్, కుమార్తె అఖిల ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావ్యవస్థలో విప్లవానికి నాంది మెగా పీటీఎంలు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి లోకేశ్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ విద్యావ్యవస్థలోనే కొత్త విప్లవానికి నాందిగా నిలవబోతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి లోకేశ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని పాఠశాలలు, కళాశాలల్లో గురువారం పండుగలా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వినుకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జప్రుల్లా, తహసీల్దార్ సురేష్, మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు, నూజెండ్ల మండల అధికారి వరదా సుబ్బారావు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, టీడీపీ నాయకులు షమీమ్, పాఠశాల ఉపాధ్యాయినీలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్ కార్యక్రమంలో చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

● నరసరావుపేట టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో గురువారం మెగా పేరేంట్ టీచర్ మీటింగ్ 2.0 ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కమీటి అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని పాతూరు శివాలయం సమీపంలో ఉన్న భవిత పాఠశాలలో గురువారం పేరేంట్ టీచర్ మీటింగ్ 2.0 జరిగింది. ముఖ్యఅతిథులుగా ఏఎల్ఎస్‌సీ శ్రీనివాసరావు, ఐఈ కో-ఆర్డినేటర్ ఎస్ సేల్వరాజ్, కర్నాటి కృష్ణమూర్తి, నిర్వాహకులు జీ మేరికుమారి, ఎస్ పద్మజా హాజరయ్యారు.

● శావల్యాపురం: శావల్యాపురం జడ్పీ పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల్లో జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన 16మంది విద్యార్థులను, ట్రిపుల్ఐటీ సీట్లు సాధించిన 7గురు విద్యార్థులను, టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను జీవీ అభినందించారు.

● నూజెండ్ల: మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కంభంపాడు జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ వరదా సుబ్బారావు పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.


బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● నరసరావుపేట లీగల్: విద్యార్థులలో వికాసం, మంచి భవిష్యత్తు దిశగా వారిని సక్రమ మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. లింగంగుంట్లలోని శంకరభారతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ పాటు అదనపు ఎస్పీ సంతోష్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నరసరావుపేట ఆర్డీవో, శంకర భారతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. శారద జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. పసుమర్రు జడ్పీ హైస్కూలులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ బి.నారదముని పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకయ్యే 10వ తరగతి పరీక్షల ఫీజు మొత్తాన్ని హెడ్మాస్టర్ వై హనుమంతరావు అందచేశారు. 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.30వేల నగదు బహుమతులను నలుగురు విద్యార్థులకు అందచేశారు.


బోయపాలెం గురుకులు పాఠశాలలో విద్యార్థికి స్కూలు బ్యాగును అందజేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

● నాదెండ్ల: మండలంలోని గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొన్నారు. దాతల సహకారంతో సుమారు రూ.35లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి భూమి పూజచేశారు. ప్రహరీ నిర్మాణానికి పలువురు దాతలు చెక్కులను పుల్లారావు ద్వారా ప్రధానోపాధ్యాయులు కృష్ణా నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ షేక్ రఫాని, ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, ఎంఈవో కృష్ణారెడ్డి, కమిటీ చైర్మన్ కొండెపోగు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు గురువారం వైభవంగా జరిగాయి. రొంపిచర్లలోని దేవుడు మాన్యం కాలనీలో గత పాఠశాలలో జరిగిన సమావేశంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మాధ్యూబాబు పాల్గొన్నారు. రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.


గణపవరం పాఠశాలలో పుల్లారావుకు చెక్కును అందిస్తున్న దాతలు

● ఈపూరు: మండలంలోని జరిగిన పీటీఎం సమావేశాలంలో ముఖ్యఅతిథిగా ఎంఈవో పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యక్రమాలలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జగ్గారావు పాల్గొన్నారు.

● యడ్లపాడు: బోయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన మెగా టీచర్స్, పేరెంట్స్‌డే సమావేశంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ టీచర్ల ఆత్మీయ సమ్మేళనాలు సందడిగా సాగాయి. ఆయా కార్యక్రమాల్లో విద్యా కమిటీ చైర్మన్‌లతో పాటు సభ్యులు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


నేతన్నల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం సూచించారు. పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో గురువారం జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి చేనేత కార్మికుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర జౌళిశాఖ ఒక్కో నేత గ్రూపునకు రూ.85లక్షల వరకు సబ్సిడీ ఇస్తోందని, గ్రూపుసభ్యులు కేవలం రూ.3లక్షలు కట్టుకుంటే చాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. చేనేత వర్గం ఉన్నతస్థానాలకు ఎదగాలన్నా, కార్మికులు ఆర్థికంగా బలపడాలన్నా రాజకీయాలు పక్కనపెట్టి అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు.

స్విమ్మింగ్‌లో జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ స్థాయిలో ఉంటాయని చెప్పారు. జూనియర్ల విభాగంలో గ్రూపు-1లో పాల్గొనేవారు 2008, 2009, 2010 సంవత్సరాలలో జన్మించి ఉండాలన్నారు. అలాగే గ్రూపు-2లో పాల్గొనేవారు 13, 14 సంవత్సరాలు, సబ్ జూనియర్ల విభాగంలో 11, 12 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, వాటర్ పోటీల్లో పాల్గొనేవారు 17సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎంపికల కోసం రూ.300, వాటర్ పోటీలలో పాల్గొనేవారు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 11 సాయంత్రం 7 గంటలలోపు ధ్రువపత్రాలతో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కమిటీ సభ్యుల పర్యటన

రొంపిచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు, మాచవరం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కమిటీ సభ్యులు గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో పరిశుభ్రత పరిశీలించారు. అదేవిధంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రహదారుల గురించి ఆరా తీశారు. సంతగుడిపాడులోని కేజీబీవీ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు వీక్షించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ప్రత్యేక అధికారి బాల శౌరీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి

● గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి ఉందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్ర నరసరావుపేట క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళకు నెలకు ఇస్తామన్నా రూ.1500 ఏవి అని ప్రశ్నించారు. 20లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఉద్యోగం వచ్చేవరకు ఇచ్చే నిరుద్యోగ భృతి రూ.3వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ కోసం చాలామంది ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం మీద ఉన్న ప్రజల ఆగ్రహాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎమ్మెల్యేలు, మంత్రులను బలిపశువులు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, ఎమ్మెల్యేలు గడప గడపకుపోతుంటే ప్రజలు నిలదీస్తున్నారన్నారు. బాధ్యత తెలిసిన నాయకుడుగా జగన్‌మోహన్ రెడ్డి రైతులకు గిట్టుబాటు ధరకోసం పోరాడుతున్నారన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ విధానాలు మార్చుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ తన విధానాలు మార్చుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీఐటీయు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే హనుమంతరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు, రైతులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోడీ కార్పొరేట్‌ల పక్షాన నిలిచి ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దూకుడుగా వ్యవహరిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా 25కోట్లమంది, రాష్ట్రంలో 15లక్షల మందికి పైగా సమ్మెలో పాల్గొన్నారని, కోట్లమంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారన్నారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజనం, నేషనల్ హెల్త్ మిషన్, తదితర స్కీమ్ వర్కర్లు, లక్షల మంది భవననిర్మాణ, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ తదితర రంగాలలో అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విభాగలలో చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వీరందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్, అనుబంధ సంఘాల నాయకులు డీ శివకుమారి, జీ మల్లేశ్వరి, కేపీ మెటిల్డాదేవి, తెలకపల్లి శ్రీను, బొంకూరి వెంకటేశ్వర్లు, షేక్ సిలార్ మసూద్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, బందగీసాహెబ్, హరిపోతురాజు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

వినుకొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలోని సాయిబాబా దేవస్థానంతో పాటు బోసుబొమ్మ సెంటర్ సాయిబాబా దేవాలయం, మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని చిన్నషిరిడీ దేవస్థానాల్లో గురుపౌర్ణమి వేడుకలు భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎన్ఎస్‌పీ కాలనీ, బోసుబొమ్మసెంటర్‌లోని ఆలయాలను సందర్శించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, కొత్తపల్లి, వడ్లమూడివారిపాలెం, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల్లో షిరిడీ సాయి బాబా ఆలయాల్లో గురు పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న షిరిడిల సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడులకు ఘనంగా నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న వెంకటేశ్వర కల్యాణ మండపంలో వెంకటేశ్వర యోగాసేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ గురువు కూనిశెట్టి వెంకట జనార్దనరావును యోగ సాధకులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రధాన యోగ గురువు ఏ వెంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ దేశానికి సంస్కృతి, సనాతన ధర్మాన్ని అందించిన వేదవ్యాసుడు పుట్టిన ఆషాడ పౌర్ణమిని గరుపౌర్ణమిగా జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో యోగ సాధకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పురుషోత్తపట్నంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంలో దేవస్థాన చైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి సాయినాథుని పల్లకీ సేవలో పాల్గొని అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం రొట్టెల పూజ, రథోత్సవం జరిగింది. నరసరావుపేట రోడ్డులో పాతసంత వెనుక ప్రాంతంలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ చల్లా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పాలాభిషేకముతో పాటు అష్టోత్తర పూజ, ధూప దీప నైవేద్యాలతోమహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వాసవీనగర్ లో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తి శ్రద్ధలతో గురు పౌర్ణమి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రచయిత, గురువులు పీవీ సాంబశివరావును, తెలుగు బాల సాహిత్య రచయిత దార్ల బుచ్చిబాబును బీజేపీ నాయకులు పరాంకుశం శ్రీనివాస్, జయరాంరెడ్డి, కోట పవన్ గాంధీ, గోరంట్ల పిచ్చయ్య, అదిమూలం గురుస్వామి


ప్రసంగిస్తున్న హిమాలయ గురువు

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో గల సాయి బాబా దేవాలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గణపవరం గ్రామంలోని శాంతినగర్, జాతీయ రహదారి పక్కన ఉన్న కొత్త మార్కెట్ సమీపంలోని షిరిడీ ఆలయం, నాదెండ్ల గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, పల్లకి సేవ, కాగడ హారతిలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. గణపవరంలోని సాయి ఆలయాన్ని మునిసిల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, నాయకులు శేషయ్య, కంచర్ల శ్రీనివాసరావు, నాగభూషణం తదితరులు కలసి ప్రత్యేక పూజలు చేశారు.


వినుకొండలో సాయిబాబాకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న చీఫ్‌విప్ జీవీ

● నరసరావుపేట కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) గురు పౌర్ణమి సందర్భంగా గురువారం సత్తెనపల్లి రోడ్డులోని షిరిడి సాయిబాబా ఆలయంలో భక్తులు బాబాకు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలి వచ్చారు. విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యాత్రకు హిమాలయ గురువు

వినుకొండ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాలుగు సంవత్సరాల అనంతరం తాను నేటి నుంచి హిమాలయాలకు వెళ్తున్నానని, శాంతి ట్రస్ట్ ఆశ్రమం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన భవనంలో యోగా, నిత్యఅన్నదాన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. అండగా నిలిచిన భక్తులకు, శ్రేయోభిలాషులకు, ఆశ్రమ వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు: టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య

నరసరావుపేట రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య తెలిపారు. నరసరావుపేట మండలం కేఎం అగ్రహారం, పమిడిపాడు గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ పునాటి శ్రీనివాసరావు పాల్గొని కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో చేసిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమలను వివరించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలం నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం: జిల్లా అదనపు ఎస్పీ సంతోష్

నరసరావుపేట లీగల్, జులై 10 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా రక్షణకు పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్ గురువారం తెలిపారు. బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా సేవలందిస్తూ నాసరయ్య ఆరోగ్య సమస్యతో పదవీ విరమణ పొందారు. ఆయనకు అదనపు ఎస్పీ రూ.5,00,000 చెక్కును గురువారం ఏఎస్పీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డు సిబ్బంది సమస్యలను కనీస అవసరాలను ఎప్పటికప్పుడు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తున్న హోంగార్డ్ ఆర్ఐ కృష్ణను అభినందించారు. తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా సేవలందిస్తూ గుండెపోటు వలన ఫిబ్రవరి 18న మరణించిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆయన రూ.5లక్షల రూపాయల చెక్కును అందజేశారు. సాటి హోంగార్డులకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేసిన హోంగార్డ్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

బస్టాండ్‌లో సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాటుపై హర్షం

నరసరావుపేట టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులు సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటుచేయటంపై స్వర్ణాంధ్ర సమాచార హక్కు సొసైటీ రాష్ట్ర షేక్ సైదా గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఫాన్లు ఏర్పాటుచేయాలని డీపీటీవో మోరుబోయిన మధును కోరటంతో ఆయన స్పందించి ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీపీటీవో మధు ప్రస్తుతం బదిలీపై విజయవాడ డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్‌గా పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు వెళ్లారన్నారు. ఆస్థానంలో పొన్నూరు డీఎంగా పనిచేస్తున్న టీ అజితకుమారి డీపీటీవోగా పదోన్నతిపై వచ్చారన్నారు.

ప్రజా ప్రతినిధులు లేకుండా గ్రామసభ

● అధికారులపై గుంటుపాలెం ఇన్‌చార్జి సర్పంచ్ ఆరోపణ

గుంటుపాలెం (శావల్యాపురం) జూలై 10 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం చేపట్టిన సామాజిక తనిఖీల్లో భాగంగా శావల్యాపురం మండలం గుంటుపాలెం గ్రామంలో సర్పంచ్‌ని పిలువకుండా అధికారులు గురువారం గ్రామసభను నిర్వహించారని ఇన్‌చార్జి సర్పంచ్ మద్దినేని ఆంజనేయులు ఆరోపించారు. సభ ప్రారంభమయ్యే గంట ముందు తనకు పంచాయతీ కార్యదర్శి ఫోన్‌చేసి గ్రామసభకు రావాలని కోరారన్నారు. తనకు విలువ ఇవ్వకుండా ప్రోటోకాల్‌ను అతిక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఫ్రాన్సిస్‌ను వివరణ అడగగా డీఆర్పీ సర్పంచ్ వద్దకు వెళ్ళినపుడే 10వ తేదీన గ్రామసభ జరుగుతుందని చెప్పాడని, ఉదయాన్నే సర్పంచ్‌కి ఫోన్‌చేస్తే గుర్తులేదని చెప్పాడన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 12గంటలకు గ్రామసభ ప్రారంభించామన్నారు.